
# చిన్నారి ఉత్తరం !

"మధ్యాహ్నం టపాలో మీకీ ఉత్తరం వచ్చింది సార్ !"

అటెండరు అసిరయ్య టేబుల్ మీద పడేసిన





ఉత్తరాన్ని యాథా లాపంగా అందు కున్నాడు శంకర్రావు. చిన్న కవరు ఆఫీసు అడ్రసుకు, తన పేరు మీద వచ్చింది. కవరు తిప్పి చూశాడు. ఎక్కడ నుంచి వచ్చిందో వివరం లేదు... ఆలోచనగా కవరు చించాడు శంకర్రావు. లోపల రెండు తెల్లకాగితా లున్నాయి. తెల్లటి కాగితాల మీద నల్లటి అక్షరాలు. అలికినట్టుగా ఉన్నా అందంగానే ఉన్నాయి. శంకర్రావు కళ్ళు ఆత్రంగా అక్షరాల వెంట పరిగెడుతున్నాయి.

నాన్నా !

ఎలా ఉన్నావు ? ఎప్పుడు వస్తావు...? నువ్వు క్షేమంగా ఉన్నావా...? నేనూ అమ్మా, చెల్లీ, తాతయ్యా, అమ్మమ్మా అందరం ఇక్కడ క్షేమంగా ఉన్నాం... ఇంతకూ నేనెవరినో తెలిసిందా...? నేను నాన్నా ! మీ పెద పాప పద్మని... ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానో తెలుసా...? పూర్తిగా చదువు మరీ..?

నాన్నా మా మీద నీకు కోపంగా ఉందా...? మేమంటే నీకు ఇష్టంలేదా ? మమ్మల్నిక్కడ ఎందుకు వదిలేశావు...? నాన్నా !అమ్మ నిన్ను తలచుకుని రోజూ ఏడుస్తోంది. రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోవడంలేదు. చెల్లినీ, నన్నూ దగ్గరికి తీసుకుని గొల్లుమంటుంది. నేను ఎన్నిమాటలు చెప్పినా వినదు. ఏడుపు మానదు. నాన్నా ! అమ్మకు విడాకులు ఇస్తాననీ, మరో పెళ్ళి చేసు కుంటాననీ, అన్నావటకదా ! తాతయ్య నీ దగ్గర్నుంచి వచ్చి బాధపడుతూ చెప్పాడు. నాన్నా ! విడాకులంటే ఏమిటి...? నేనూ, అమ్మా, చెల్లీ నీకు వద్దా...? నిజంగానేనా...? మరి నువ్వంటే నాకు చాలా ఇష్టమే...ఎలా...? పెళ్ళంటే ఏంటి నాన్నా...? నువ్వు మరో పెళ్ళి చేసుకుంటే అమ్మకు బాధేంటి...?

నాన్నా !

అమ్మకూ, నాకూ, చెల్లికీ ఇక్కడ ఏమీ బాగా లేదు... నువ్వు ఎప్పుడొస్తావు...? మమ్మల్ని ఎప్పుడు తీసుకువెళ్తావు...? అసలు వస్తావా రావా...? తాతయ్య పాపం, ఈ వయసులో ఎంత

కష్టపడుతున్నాడో తెలుసా...? పగలంతా ఎక్కడో పనిచేసి, రాత్రిళ్ళు మేమంతా నిద్రపోయిన తరువాత ఎప్పుడోవస్తాడు. అమ్మమ్మ ఒక్కపూటే అన్నం వండుతోంది. రెండోపూట జావ కాస్తుంది. అప్పుడప్పుడూ ఉప్మాకూడా చేస్తుందనుకో... మేము తాత గారింటికి వచ్చి ఆరునెలలయిందంటగా... నెల నెలా నీకు జీతం రావడంలేదా నాన్నా ! అమ్మ, అమ్మమ్మ నీ జీతం గురించి మాట్లాడుకుంటున్నారు. నువ్వు డబ్బులు ఎందుకు పంపించడం లేదూ...?

నాన్నా ! ఈ ఆరు నెలలనుంచీ నా చదువు మూలపడి పోయింది. నాకెంత బాధగా ఉందో తెలుసా ! ఇక్కడ బళ్ళోకి వెళ్తాను అంటే అమ్మ, చదువు వద్దూ, చట్టబండలూ వద్దూ అంటూ విసుక్కుంటోంది. నిన్న నన్ను కొట్టింది కూడా...!

నాన్నా ! అమ్మకడుపు ఎత్తుగా ఉంది. అమ్మ కడుపులోంచి నాకు మరో చెల్లి పుడుతుందటగా ! పాపం ! అమ్మ బరువుగా నడవలేక నడుస్తోంది. దానికి తోడు మూలుగు ఒకటి... నాన్నా ! అమ్మకు మళ్ళీ చెల్లి పుట్టడం నీకు ఇష్టం లేదట. అమ్మకడుపులో ఉన్నదీ ఆడపిల్లో, మగపిల్లవాడో తెలియడానికి పరీక్ష చేయించావట కదా ! కడుపులో చెల్లిని కడుపులోనే చంపెయ్యడానికి అమ్మ ఒప్పుకోలేదనీ, మందులు మింగలేదనీ మమ్మల్ని తాతగారింటికి పంపించేశావా...? అవును... అమ్మను అందుకేనా అస్తమాను నువ్వు గట్టిగా కొట్టేవాడివి. తిట్టేవాడివి. అమ్మను అప్పట్లో ఎందుకు కొట్టేవాడివో నాకు తెలిసేదికాదు.

నాన్నా అమ్మ కడుపులో మళ్లీ చెల్లి పుట్టడానికి కారణం ఎవరు...? దేవుడేనా...? దేవుడిదీ తప్పే కదా...? ఆడపిల్ల పుట్టడం తప్పు అనుకుంటే ఆ తప్పు దేవుడే కదా చేశాడు. అలాంటప్పుడు దేవుడ్ని వదిలేసి అమ్మమీదే కోపం ఎందుకు...? నువ్వు వదిలేసినా, దేవుడ్ని నేను వదలనులే. నాకల్లోకి వస్తాడుగా. దేవుడితో గట్టిగా దెబ్బలాడుతాను.

నాన్నా ! నీకు ఆడపిల్లలంటే కోపమా ? అసహ్యమా...? ఎందుకనీ...? నేనూ, చెల్లెలు సీత, వరుసగా పుట్టినపుడే పెద్దగొడవ చేశావంటగా. ఆడపిల్లలంటే అసహ్యం ఎందుకు నాన్నా...? నాన్నమ్మ గారూ చిన్నప్పుడు ఆడపిల్లేగా నాన్నమ్మగారి కడుపులోంచేగా నువ్వు వచ్చింది. నేనూ ఆడపిల్లనే, అమ్మా, అమ్మమ్మా ఒకప్పుడు ఆడపిల్లలే... అసలు ఆడపిల్లలు లేకపోతే మగపిల్లలు ఎలా పుడతారు నాన్నా...?

నాన్నా ! నాకు నిజంగా ఏడుపొస్తోంది... నిన్ను తలచుకుంటే మరీ ఏడుపొస్తోంది... ఈ ఏడుపు నాపుకోవడం ఎలా...? అమ్మ ముఖం చూస్తే ఏడుపు...ఆకలీ అని ఏడ్చే చెల్లి కడుపును చూస్తూ ఏడుపు. అమ్మమ్మ ఒంగిపోయిన నడుమును చూసినా ఏడుపే... బక్కగా ఉన్న తాతయ్య దగ్గును విన్నా ఏడుపే... అమ్మ కడుపులో ఉన్న చెల్లిని తలచుకున్నా ఏడుపే వస్తోంది... ఎలా నాన్నా ! ఈ ఏడుపును ఎలా ఆపుకోను ? అందరూ నిద్రపోయారు. నాకు మాత్రం నిద్రరావడంలేదు. లాంతరు వెలుగులో ఒక్క దాన్నీ కూర్చొని ఉత్తరం రాస్తున్నాను. నీ అడ్రసు తాతయ్యే ఇచ్చాడు. కవరు కూడా తాతయ్యే తెచ్చిపెట్టాడు. నాన్నా ! అమ్మ ఇప్పుడే పడుకుంది. చెల్లి చాపమీద పడుకుని డొక్కలు ఎగరవేస్తోంది. తాతయ్య గురక పెడుతున్నాడు. అమ్మమ్మ వంటగదిలో పడుకుందేమో, నాన్నా ! నేను చదువుకుని పెద్దదాన్నయి పెద్ద ఉద్యోగం చేద్దామనుకున్నాను. కానీ నాకు చచ్చిపోవాలని ఉంది నాన్నా ! ఎందుకంటే నువ్వు రావు. మమ్మల్ని తీసుకువెళ్ళవు. వారం రోజుల్లో నాకు మళ్ళీ మరో చెల్లిపుడుతుంది. అప్పుడు ముగ్గురు ఆడపిల్లలు అవుతాం. బరువు నేను మోయలేనూ అన్నావటకదా ! వాళ్ళను పెంచి పెద్దచేసి పెళ్ళిళ్ళు చేయడం నావల్లకాదూ అన్నావట... నాన్నా ! నేను చచ్చిపోతే, మరో చెల్లి పుట్టినా, ఇద్దరే ఆడపిల్లల వుతారు. ఇద్దరు ఆడపిల్లలయితే ఫరవాలేదుగా నీకు! నిజంనాన్నా ! నేను చచ్చిపోతాను ఈ ఉత్తరం అందిన వెంటనే, నువ్వు వచ్చి మమ్మల్ని

తీసుకు వెళ్ళకపోతే నాలుగు రోజులు నీకోసం ఎదురుచూసి, అయిదో రోజున అందరూ నిద్రపోయిన తరువాత అమ్మకు కూడా చెప్పకుండా, తాతగారి దొడ్లో నేలనూతిలోకి దూకేసి చచ్చి పోతాను. వీధి చివర సీతమ్మ గారి కోడలు, నూతిలోకి దూకి చచ్చి పోయిందటగా, అలాగే నేనూ కూడా నిజంగానే చచ్చిపోతాను, నాన్నా నువ్వు వస్తావా రావా? నీకోసం ఏడుస్తూ ఎదురుచూస్తూ" నీ పెదపాప పద్మ.

ఉత్తరం చదివిన శంకర్రావు ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు ! అతని కళ్ళల్లో నీళ్ళు! గిర్రున తిరిగాయి. గుండె బరువెక్కి బావురు మన్నట్లయింది. మనసు నీరు కారిపోయింది. నరనరాల్లో సన్నటి వణుకు ప్రారంభమయింది.

"అసిరయ్యా" శంకర్రావు అరిచినట్టేపిలిచాడు.

మరుక్షణంలో అటెండరు అసిరయ్య అతని ముందు నిలబడ్డాడు.

"ఈ ఉత్తరం నాది కాదయ్యా నా పేరు కూడా ఎమ్. శంకర్రావే. పాపం ఎవరో చిన్న పిల్ల చచ్చిపోతానని తండ్రికి ఉత్తరం రాసింది. ఉత్తరం పూర్తిగా చదివాను. నా బుర్ర పాడయిపోయింది. ఎవరో ఆ దౌర్భాగ్యుడు చూడు.." శంకర్రావు బాధపడిపోతూ ఆ కవరుని అసిరయ్య చేతిలో పెట్టేశాడు.

అసిరయ్య అయోమయంగా నిలబడి పోయాడు...!

మన ఆఫీసులో శంకర్రావుగారు మీరు తప్ప మరెవ్వరూ లేరండి !"

అసిరయ్య సణుక్కుంటున్నట్టుగా అన్నాడు.

"నీకు తెలుసుకదయ్యా ! నాకసలు ఆడపిల్లలేలేరు.. ఈ పిల్ల ఎవరో, ఎక్కడ్నుంచి రాసిందో ఉత్తరం ! ఆఫీసు అడ్రసు తప్పు రాసిందేమో... ఎందుకలా రాసిందో? పాపం చిన్న పిల్ల! వాడెవడో... ఏ ఆఫీసులో ఉన్నాడో... వాడసలు మనిషో... జంతువో... మళ్ళీఆడపిల్ల పుడుతోందనీ, పెళ్ళాం బిడ్డల్ని పుట్టింట్లో వదిలేశాడట. ఆ పిల్ల హృదయ విదారకంగా ఉత్తరం రాసింది. వెళ్ళు ! మన చుట్టుపక్కల ఆఫీసుల్లో శంకర్రావు ఎవడన్నా ఉన్నాడేమో కనుక్కో...! నా నెత్తిమీద బోలెడుపని తగలడింది...." శంకర్రావు తన పనిలో మునిగిపోయాడు...!

అటెండరు అసిరయ్య ఆ ఉత్తరం పట్టుకుని ఆ ఆఫీసు బయటకు వచ్చాడు.

ఏ ఆఫీసని ఎతకాలి... నాకంత తీరికేది...? అదిగో... ఆఫీసరు గారి గదిలో అప్పుడే బజరు మోగిపోతున్నాది... అయ్యబాబో... అయ్యగారు పిలుత్తున్నారు..."

ఆఫీసరు గదిలోకి హడావుడిగా వెళ్ళిపోతూ... అసిరయ్య చటుక్కున ఆ ఉత్తరాన్ని ఆఫీసు ప్రక్క చెత్తకుండీలోకి, విసిరేశాడు... చెత్తకుండీలో పడ్డ ఉత్తరం రెక్కలు తెగిన పక్షిలా గిలగిలా కొట్టుకుంది. ఎక్కడో మాకు మూల పల్లెటూళ్ళో... తండ్రికోసం ఎదురు చూస్తోన్న పదేళ్ళ పద్మ నెత్తిమీద నుంచి ఒక తీతువు పెట్ట తీరికగా అరుస్తూ వెళ్ళిపోయింది...!

మనసూ, మానవత్వం లేని మనుషుల వల్ల నేనూ నిస్సహాయంగా... ఈ చెత్త కుండీలో పడిపోయానే... ఆఫీసు అడ్రసులో రెండక్షరాలు తప్పు రాసిన కారణంగా గమ్యం చేరలేకపోయానే... అయ్యో... నా చిన్నారి పద్మకు సాయం చేయలేక పోయానే !" అనుకుంటూ ఆవేదనగా ఉత్తరం తన కన్నీటి సంతాపాన్ని ప్రకటించింది...!

గీతాంజలి పక్ష పత్రిక
15- 11-1994